యూనిట్ IV

# 11. వైజ్ఞానిక కబుర్లు

**ఆలోచించండి - మాట్లాడండి**




- రెక్కలువస్తే విద్యార్థులు ఏం చేస్తారో ఊహించి మాట్లాడండి.
- కాలయంత్రంలో గగనతలంలో మీరు విహరిస్తే ఏం చేస్తారో ఊహించి చెప్పండి.
- మిమ్మల్ని మీరు విమానాన్ని కనిపెట్టిన రైట్ సోదరులలో ఒకరుగా ఊహించుకోండి. విమానాన్ని తయరుచేసిన వెంటనే మీరేం చేస్తారో ఊహించి చెప్పండి.

**ఉద్దేశం:** విద్యార్థులలో ఆలోచనాశక్తిని పెంపొందించడం, సైన్సు సంగతులమీద ఆసక్తి కలిగించడం. ఈ పాఠం ఉద్దేశం.

**విద్యార్థులకు సూచనలు:**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాలకింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గుర్తించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న 'అర్థాల పట్టిక' చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.







రాఘవవాళ్ళ బాబాయి వచ్చాడనగానే పిల్లలందరికీ ఎక్కడలేని సంతోషం. ఆయనను పిల్లలంతా 'సైన్సు మామయ్య' అని ప్రేమగా పిలుచుకుంటారు. ఆ రోజు కూడా పొద్దున్నే బిలబిలా పిల్లలంతా రాఘవ ఇంటికి చేరారు. మామయ్యతో కబుర్లకోసం. వాళ్ళ కబుర్లేమిటో వాళ్ళ మాటల్లోనే విందాం-

మామయ్య : పిల్లలూ! ఈ రోజు పాఠశాలలకు సెలవు ఇచ్చారా? అంతా తీరికగా చేరారు.

రాజు : అవును మామయ్యా! ఈ రోజు మా స్కూలు పిల్లలంతా సినిమా చూడడానికి వెళుతున్నాం. 'గ్లోబల్ వార్మింగ్' అనే సినిమానట. ఇంకా సమయం ఉందని మేమంతా ఇక్కడికి వచ్చాం. అసలు గ్లోబల్ వార్మింగ్ అంటే ఏమిటి మామయ్యా?

మామయ్య : మామూలుగా భూమ్మీద ఉష్ణోగ్రత ఒక క్రమపద్ధతిలో ఉంటుంది. అది అలా ఉండటంవల్లనే మనం చక్కగా జీవించగలుగుతున్నాం. ఈ ఉష్ణోగ్రత మన అవసరాలను మించి ఉండటాన్నే గ్లోబల్ వార్మింగ్ అంటాం.



© SCERT not to be republished

రాఘవ : అంటే భూమి అతిగా వేడెక్కడమేనా?

మామయ్య : అవును.

సౌమ్య : అయితే! భూమి అతిగా వేడెక్కడానికి కారణం ఏమిటి మామయ్యా?

మామయ్య : చాలా కారణాలున్నాయి. భూమి చుట్టూ ఓజోన్ అనే పొర భూమికి రక్షణ కవచంలా పనిచేస్తుంది. ఈ ఓజోన్‌పొర కరగడంవల్ల భూమి వేడెక్కుతుంది. ఇంతేకాక పర్వతాలు విరజిమ్మే లావా, ధూళికణాలు, కార్చిచ్చు, ఫ్యాక్టరీలు, వాహనాలు ఇలాంటివన్నీ భూమి ఉష్ణోగ్రతను పెంచుతున్నాయి.

సుమన్ : పెరుగుతున్న ఉష్ణోగ్రతను తగ్గించడానికి మనం ఏమైనా చేయవచ్చా?

మామయ్య : ఎన్నో చేయవచ్చు. చెట్లను పెంచాలి. ప్రజలకు అన్ని విషయాలూ చెప్పి చైతన్యవంతులను చెయ్యాలి. అందుకే మీకు సినిమా చూపిస్తున్నారు. తెలిసిందా?

రాధిక : నిన్న ఇంట్లో టీవీలో సినిమా చూస్తుంటే, మా నాన్న అలా చూడడం కళ్ళకు మంచిది కాదన్నాడు. నిజమేనా మామయ్యా?

మామయ్య : చూడగూడదు. టీవీలోని దృశ్యాలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. దీనివల్ల కాంతిస్థాయి హెచ్చుతగ్గులకు గురౌతుంది. టీవీ నుండి విడుదలయ్యే కిరణాలవల్లకూడా కళ్ళకు హాని కలుగుతుంది.

సుమన్ : సినిమా థియేటర్‌లో ఇలాంటి కిరణాలు ఉండవుకదా! మామయ్యా?

మామయ్య : అవును. టీవీనుంచి విడుదలయ్యే కిరణాలు సూటిగా కళ్ళకు తాకడంవల్ల హాని కలుగుతుంది. అందుకే చీకట్లో తదేకంగా టీవీ చూడవద్దు. టీవీకి అతిదగ్గరనుంచి చూడవద్దు.

వైష్ణవి : చీకటి అంటే గుర్తొచ్చింది పిల్లులు చీకట్లోగూడా చూడగలుగుతాయంటారు. నిజమేనా మామయ్యా?

మామయ్య : నిజమే! అలా చూడడానికి కారణం దాని కంటి నిర్మాణమే. పిల్లి కంటిని వెడల్పుచేసి చూడగలదు. దాని కంటి అమరిక ఎక్కువ కాంతిని చూసేలా ఉంటుంది. కాంతి పిల్లి కనుగుడ్డుమీద ప్రసరించినప్పుడు ఆ దృశ్యం మనలాగా చెదిరిపోదు. దానికంట్లో ప్రత్యేకమైన భాగాలుంటాయి. వీటిని రాడ్ అంటారు.

సుమన్ : ఆ రాడ్ వల్లే అవి చీకట్లో చూడగలుగుతాయా?

మామయ్య : అవును.

ప్రసాద్ : ఈ సంగతి వింటే మన కంట్లో కూడా అవి ఉంటే బాగుండుననిపిస్తుంది.

రాజు : ఔను. కరెంట్ లేకున్నా మనం చీకట్లో హాయిగా చదువుకోవచ్చు! (అంతా నవ్వుతారు).

మామయ్య : నవ్వండి.. నవ్వండి.. హాయిగా నవ్వండి.. అలా నవ్వురావడానికి కారణం తెలుసా మీకు?

కౌశిక్ : ఏదైనా జోక్ వింటే నవ్వొస్తుంది.

మాధవ : జోక్ విన్నా నవ్వొస్తుంది. ఏదైనా హాస్య సన్నివేశం చూసినా నవ్వొస్తుంది కదూ!

మామయ్య : ఔను. ఏదైనా జోక్ విన్నా, హాస్య సన్నివేశం చూసినా మన మెదడులోని ఒక నాడికి ప్రేరణ కలుగుతుంది. దీనివల్ల నవ్వొస్తుంది. మెదడులోని ఒక భాగం ముఖంలోని నవ్వేభాగాన్ని, మరోభాగం నవ్వు శబ్దాన్ని ప్రేరేపిస్తాయి. నవ్వడంవల్ల నాడులన్నీ ఉత్తేజం పొందుతాయి. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. చక్కటి ఆరోగ్యానికి హాయిగా నవ్వాలి. ఒకసారి అంతా నవ్వండి చూద్దాం!

(అంతా నవ్వుతారు)



రాజేశ్ : ఇప్పుడు మా నాడులన్నీ ఉత్తేజం పొందుతున్నాయా మామయ్యా!

మామయ్య : అవును. రాజేశ్! అందరూ నవ్వుతుంటే నువ్వేమిటి, అదోలా ముఖం పెట్టావ్? ఏమయింది?

రాజేశ్ : నా చేతికి దోమకుట్టింది. ఇదిగో చూడండి. కుట్టినచోట దద్దురుకూడా వచ్చింది.

(అంతా రాజేశ్‌వైపు చూస్తారు)

మామయ్య : ఆ దోమ అలా ఎందుకు కుట్టిందో తెలుసా?

రాజేశ్ : రక్తం తాగడానికి.

మామయ్య : నిజమే! కాని దానికి రక్తం ఎందుకో తెలుసా?

(అంతా ఒకరిముఖం ఒకరు చూసుకుంటారు)

మామయ్య : ఆ కుట్టింది ఆడదోమ. ఆడదోమ శరీరంలో ఫలదీకరణం చెందిన అండాలకు కావలసింది ఒక రకమైన సొన. సొనను ఉత్పత్తి చేయాలంటే ప్రొటీన్లు కావాలి. ఈ ప్రొటీన్లు మానవుల జంతువుల రక్తంలో ఉంటాయి. రక్తం సాంద్రత ఎక్కువగా ఉంటుంది కదా! అందుకే దోమ తన నోటిద్వారా జలాన్ని స్రవింపజేసి ఆ రక్తాన్ని పలచగా చేస్తుంది. అందుకే అది కుట్టినచోట దురదగా ఉండి దద్దుర్లు వస్తుంది.

రాజు : చిన్ని దోమ వెనక ఇన్ని సంగతులున్నాయన్నమాట! ఇవన్నీ వింటుంటే నిజంగా ఎంతో ఆశ్చర్యం వేస్తుంది.

మామయ్య : చిన్ని దోమ దగ్గరి నుంచి అంతరిక్షందాకా జరిగేవనీ అద్భుతాలే! ఆశ్చర్యాన్ని కలిగించే అంశాలెన్నో ఉంటాయి. ఔనా?

సౌమ్య : ఔను మామయ్యా! అంతరిక్షం అంటే గుర్తొచ్చింది. మానవులు అంతరిక్షంలోకి ఎన్నో ఉపగ్రహాలను పంపి ఎన్నో పరిశోధనలు చేస్తున్నారు.

వైష్ణవి : ఔను! ఈ మధ్య, దూరంగా ఎక్కడో ఉన్న అంగారకునిపైకి ఒక రోవర్‌ను పంపారు. ఆ సంగతి నాకు బాగా నచ్చింది.



మామయ్య : ఆ రోవర్ పేరేంటో చెప్పండి.

(అంతా ఆలోచిస్తూంటారు)

మామయ్య : నేనొక ఆధారం ఇస్తాను. 'శాస్త్రవేత్తలు ఆసక్తిని అంగారక గ్రహానికి పంపారు' ఇప్పుడు చెప్పండి.

వైష్ణవి : ఆసక్తితో పంపారా, ఆసక్తిని పంపారా మామయ్యా?

కౌశిక్ : గుర్తొచ్చింది. 'క్యూరియాసిటీ' అనే రోవర్‌ను పంపారు.

| | | |
|---|---|---|
| వైష్ణవి | : | అందుకే మామయ్య 'క్యూరియాసిటీ' (ఆసక్తి) ని అంగారక గ్రహానికి పంపారన్నాడు. |
| రాధిక | : | మీ క్లూ బాగుంది మామయ్యా! |
| | | (అంతా నవ్వుతారు) |



| | | |
|---|---|---|
| వేణు | : | మానవులు చాలా కష్టపడి ఉపగ్రహాలను తయారుచేసి పంపుతారు కదా! ఈ ఉపగ్రహాలవల్ల ఏం లాభం మామయ్యా? |
| మామయ్య | : | వినండి. ఉపగ్రహాలు మనకు చాలా విధాలుగా ఉపయోగపడతాయి. సమాచార సేకరణకోసం, వాతావరణ వివరాలకోసం ఉపయోగపడతాయి. మీరు చూసే టీవీ కూడా ఉపగ్రహాల సహాయంతోనే నడుస్తుంది. తెలుసా? |
| రాజు | : | అంతరిక్షంనుంచి ఈ ఉపగ్రహాలు భూమ్మీద పడిపోవా అంకుల్? |
| మామయ్య | : | బాగా అడిగావు. అంతరిక్షంలో పైపైకి వెళ్ళేకొద్దీ భూమికి ఉండే ఆకర్షణ శక్తి తగ్గుతుంది. ఈ ఆకర్షణ శక్తినిబట్టి భూమిచుట్టూగల కక్ష్యలో ఉపగ్రహాలను ఉంచుతారు. |
| సౌమ్య | : | కక్ష్య అంటే ఏంటి మామయ్యా? |
| మామయ్య | : | ఒక క్రమంలో తిరిగే మార్గాన్నే కక్ష్య అంటారు. భూమి కక్ష్యలో ఒక వస్తువును వదిలితే అది భూమ్యాకర్షణకులోనై భూమ్మీద పడకుండా భూమిచుట్టూ వేగంగా తిరుగుతుంది. |
| కౌశిక్ | : | అయితే అది జారిపడదన్నమాట! |
| మామయ్య | : | అన్నమాటే కాదు, ఉన్నమాటే అది! |
| సుమన్ | : | సైన్స్ సంగతులు ఎన్ని విన్నా ఇంకా తెలుసుకోవాలనే అనిపిస్తుంది. |
| మామయ్య | : | చిన్నతనంనుంచి ఇలా ఆసక్తిగలవారే పెద్దయిన తరవాత ఎన్నెన్నో వస్తువులు కనిపెట్టారు. మనం చూసే ప్రతి వస్తువు కూడా మొట్టమొదట ఎవరో ఒకరు కనిపెట్టిందే కదా! |
| రాధిక | : | వాళ్ళూ మేధావులే నన్నమాట! |
| మామయ్య | : | అవునుకదా! మీరు కూడా బాగా చదువుకొని ఎన్నో కనిపెట్టాలి. మనం మరిచేపోయాం. మీ సినిమాకి టైం కావస్తుంది. అంతా వెళ్ళండి. ఒక్క సంగతి. సినిమా చూసి వచ్చాక 'గ్లోబల్ వార్మింగ్' గురించిన సంగతులు మీరే నాకు చెప్పాలి. సరేనా! |
| అంతా | : | అలాగే, ధన్యవాదాలు మామయ్యా! వస్తాం. |
| | | (అంతా వెళతారు) |



## ఇవి చేయండి

### I. వినడం-మాట్లాడడం



1. గ్లోబల్ వార్మింగ్‌వల్ల కలిగే నష్టాలేవి?
2. టీవీ చూడడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?
3. నవ్వు ఎలా వస్తుంది?
4. ఉపగ్రహాలవల్ల లాభాలేవి?

### II. చదవడం, అవగాహన చేసుకోవడం

1. కింది గల్పిక చదవండి. ప్రశ్నలకు సమాధానాలు రాయండి.



సిద్ధరామయ్య గొప్ప శాస్త్రవేత్త. కుంటివాళ్ళు ఉపయోగించే అద్భుత సాధనాన్ని కనిపెట్టాడు. ప్రపంచదేశాలన్నీ ఆయన కనిపెట్టిన వస్తువు అద్భుతంగా ఉందని మెచ్చుకొన్నాయి. భారతదేశం పద్మభూషణ అవార్డును ప్రకటించింది. పత్రికలు అన్నీ పొగిడాయి.

రోడ్డుమీద నడుస్తూఉన్న సిద్ధరామయ్య తనవైపు వడివడిగా వస్తున్న ఒక పేదవాడిని గమనించాడు. ఆయన కుంటుతూ కుంటుతూ వచ్చి సిద్ధరామయ్య కాళ్ళమీద పడి నమస్కరించాడు. జేబులన్నీ తడిమి ఎన్ని రోజుల నుండో నలగకుండా పెట్టుకొన్న పదిరూపాయలు నోటును తీశాడు. "మీరు చేసిన గొప్ప పనిని విన్నాను. ఏమీ లేనివాణ్ణి. ఇది నా బహుమతి తీసుకోండి" అంటూ పదిరూపాయల నోటును చేతిలో పెట్టాడు.

"నేను పొందిన ఎన్నో అవార్డుల కంటే కూడా నీ బహుమతి తృప్తినిచ్చింది" అంటూ నోటును మడత పెట్టకుండా జేబులో పెట్టుకున్నాడు సిద్ధరామయ్య.

అ) సిద్ధరామయ్యను పత్రికలు ఎందుకు పొగిడాయి?

ఆ) పేదవాడు బహుమతి ఎందుకు ఇచ్చాడు?

ఇ) సిద్ధరామయ్యకు ఆ బహుమతి ఎందుకు బాగా తృప్తిని కలిగించింది?

2. పాఠ్యాంశంలోని సైన్సుకు సంబంధించిన పదాలను పట్టికగా రాయండి.

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా: ఓజోన్ | | | | |
| | | | | |
| | | | | |
| | | | | |



©SCERT not to be republished

### III. స్వీయరచన



1. కింది ప్రశ్నలకు ఐదు వాక్యాలలో సమాధానాలు రాయండి.

అ) 'గ్లోబల్ వార్మింగ్' పెరగడానికి గల ఒక కారణాన్ని వివరించి దాని పరిష్కారం రాయండి.

ఆ) గ్రహాల ఆకర్షణ శక్తిని గురించి చదివారు కదా! గోడకు వేసిన బంతి తిరిగి మనవద్దకే వస్తుంది. కారణం ఏమిటో తెలుసుకొని రాయండి.

ఇ) పాఠ్యాంశంలో మీకు నవ్వు తెప్పించిన ఒక సన్నివేశాన్ని తెలపండి.

ఈ) ఉష్ణోగ్రత ఎక్కువైనప్పుడు మన శరీరంలో కలిగే మార్పులను గురించి రాయండి.

ఉ) పాఠ్యాంశంలో నీకు నచ్చిన ఒక అంశాన్ని గురించి తెలుపుతూ కారణాలు రాయండి.

ఊ) ఏదైనా ఒక వైజ్ఞానిక ప్రశ్నను ఊహించి ప్రశ్నకు జవాబును రాయండి.

2. కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.

అ) 'పర్యావరణ పరిరక్షణ' గురించి సొంతమాటల్లో వ్యాసం రాయండి.

ఆ) పాఠ్యాంశంలో నీకు నచ్చిన ఒక అంశాన్ని గురించి తెలుపుతూ కారణాలు రాయండి.

### IV. పదజాలం



1. కింది వాటిలో ఏవైనా రెండు పదాలను ఒకే వాక్యంలో ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.

| | | | |
|---|---|---|---|
| అ) | రక్షణ కవచం | ఆ) | ఓజోన్‌పొర |
| అ) | నాడులు | ఆ) | ప్రేరణ |
| అ) | దృశ్యాలు | ఆ) | జ్ఞాపకం |


2. పిల్లిలాగ ఇతరజీవులేవైనా చీకట్లో చూడగలవా? తెలపండి.

### V. సృజనాత్మకత



భూమి మీద ఉన్న మానవుల్లో కొందరు ఉపగ్రహం సహాయంతో ఇంకొక గ్రహం మీదకి వెళ్ళారు. అక్కడ ఉన్న మానవులు చాలా వింతగా ఉన్నారు. వీరు ప్రతిదానికీ తమదగ్గరున్న రోబోలమీద ఆధారపడతారు. వాళ్ళు మానవులను చూసి ఆశ్చర్యపోయారు. ఆ గ్రహంమీది మానవులు, భూమినుండి వెళ్ళిన మానవులతో ఏం మాట్లాడి ఉంటారో ఊహించండి. సంభాషణల రూపంలో రాయండి.

### VI. ప్రశంస



1. కింది వాటిలో ఒకటి చేయండి.

అ) ఎవరైనా ఒక గొప్ప శాస్త్రవేత్తను గురించి తరగతిలో ఉపన్యసించండి.

ఆ) 'నేనే ఒక శాస్త్రవేత్తనైతే' అనే అంశంమీద మాట్లాడండి.



### VII. భాషాంశాలు



1. కింది పదాలను విడదీసి రాయండి.

ఉదా: వికసింపకున్న = వికసింపక + ఉన్న


అ) తరువులెల్ల = ______ + ______

ఆ) రాలకున్న = ______ + ______

ఇ) లోపమొక్కింత = ______ + ______

ఈ) కడలెల్ల = ______ + ______

ఉ) లోకమంతయు = ______ + ______



2. కింది వాక్యాలు ఏ పురుషలో ఉన్నాయో గుర్తించి రాయండి.



అ) నేను ఉదయం మేలుకొంటాను.

ఆ) మీరు ఎప్పుడూ మంచే పలకండి.

ఇ) మా ఊరు ధరూరు.

ఈ) అవన్నీ ఎండిపోయాయి.

ఉ) ఆయన మహనీయులు.

♦ **కింది పదాల్లో ఏయే పురుషలను సూచించే పదాలున్నాయో గుర్తించి పట్టిక తయారుచేయండి.**


అతను, మనం, ఆ, వీరు, నా, ఆమె, ఆయన, మా, మీరు, వారు, నువ్వు, ఆవిడ, అది, అవి, ఇవి, మీ, ఈయన, ఈవిడ, ఇది, ఇతను, నీ, నేను, వాళ్ళు, వీళ్ళు, ఈమె.



3. అ) కింది వాటిని గమనించండి.

తెల్లగుఱ్ఱం, నాలుగుదిక్కులు, మాయిల్లు, అన్నదమ్ములు

వీటిలో



| | | | | |
|---|---|---|---|---|
| అ) | తెల్లగుఱ్ఱం | → | తెల్ల, గుఱ్ఱం | అనే రెండు అర్థవంతమైన పదాలు ఉన్నాయి. |
| ఆ) | నాలుగు దిక్కులు | → | నాలుగు, దిక్కులు | |
| ఇ) | మాయిల్లు | → | మా, ఇల్లు | |
| ఈ) | అన్నదమ్ములు | → | అన్న, తమ్ముడు | |

ఇలా అర్థంవంతమైన చిన్న పదాలు కలిసినప్పుడు ఏర్పడ్డ పెద్దమాటనే **"సమాసం"** అని అంటారు.

♦ **కింది సమాస పదాలను పరిశీలించండి.**

అ) ద్వివిధాలు → రెండు సంఖ్యగల విధాలు

ఆ) త్రిరాత్రులు → మూడు సంఖ్యగల రాత్రులు

ఇ) నాలుగెకరాలు → నాలుగు సంఖ్యగల ఎకరాలు

ఈ) దశదిశలు → పది సంఖ్యగల దిక్కులు

ఉ) ద్వాదశాదిత్యులు → పన్నెండు సంఖ్యగల సూర్యులు

ఈ పదాలన్నింటిలోను తొలుత సంఖ్యే కనబడుతూంది కదూ! ఇలా సంఖ్య పూర్వ పదంగా సూచించే సమాసాన్ని "ద్విగుసమాసం" అని అంటాం కదూ!

మీ పాఠాల్లో ఉండే కొన్ని "ద్విగు సమాస" పదాలను వెదికి రాయండి,

4. **అ) కింది సమాసాలను ఉదాహరణలో చూపించిన విధంగా వివరించండి.**

అ) దశావతారాలు – పది (సంఖ్యగల) అవతారాలు

ఆ) ఏడు రోజులు ______________________

ఇ) పది మైళ్ళు ______________________

ఈ) చతుర్వేదాలు ______________________

ఉ) రెండు చీమలు ______________________

## ప్రాజెక్టు పని

**కింది వానిలో ఒకదాన్ని చేయండి.**

అ) శాస్త్రవేత్తలకు సంబంధించిన పత్రికలో వచ్చిన అంశాలను కొన్ని సేకరించండి. ఆల్బంగా తయారుచేయండి.

ఆ) కొందరు శాస్త్రవేత్తల పేర్లను వారు కనిపెట్టిన అంశాలను సేకరించి పట్టిక తయారుచేయండి.



## నేనివి చేయగలనా..?



| | | |
|---|---|---|
| 1. | ఒక సైన్సు అంశం గురించి మాట్లాడగలను. | ఔను / కాదు |
| 2. | పర్యావరణం గురించి, ఉపగ్రహాలవల్ల కలిగే ప్రయోజనాల గురించి సొంతవాక్యాలలో రాయగలను. | ఔను / కాదు |
| 3. | పాఠ్యాంశం ధారాళంగా చదవగలను. | ఔను / కాదు |
| 4. | ఊహించి శాస్త్రీయ అంశాలతో సంభాషణలు రాయగలను. | ఔను / కాదు |

*"మనం చేసే అన్ని వృథాలలోకీ అత్యంత ఖరీదైనది కాలహరణం."*



# యూనిట్ IV ఉత్తర కుమార ప్రజ్ఞలు

**చదువు-ఆనందించు**

డాబుకు పోయినా, డంబాలు కొట్టినా, ఈ పలుకుబడిని ఉపయోగిస్తాం.

ఉత్తరుడు (ఉత్తర కుమారుడు) విరాటరాజు ఏకైక సుపుత్రుడు. అజ్ఞాతవాస సమయంలో పాండవులు మారు వేషాలతో, మారుపేర్లతో విరాటరాజు కొలువులో తలదాచుకున్నారు. పాండవులు విరాటరాజు కొలువులో ఉండి ఉంటారనే అనుమానంతో కౌరవులు విరాటరాజు గోవులను దక్షిణం వైపున ముట్టడించారు. విరాటుడు సైన్యమంతటితో అక్కడికి వెళ్ళాడు.

అంతలో గోపాలకులు వచ్చి, కౌరవులు ఉత్తర దిశనుండి వచ్చి గోవులను తోలుకుపోతున్నారని ఉత్తరుడితో మొరపెట్టుకున్నారు.

"తగిన సారథి లేడు, ఉంటేనా, కౌరవసేనను చీల్చి చెండాడి, గోవులను కాపాడగలను" అంటూ కోటలోని స్త్రీల ముందు కోతలు కోశాడు ఉత్తరుడు. సారథి లేడనుకోవడం మారువేషంలో, మారుపేరుతో (సైరంధ్రిగా మాలిని పేరుతో) ఉన్న ద్రౌపది విని, బృహన్నలకు సారథ్యం తెలుసునని అతనికి చెప్పింది. "నాలాంటి వీరునకు ఆటపాటలు నేర్పుతూ బతికే ఆ ఆడంగి బృహన్నలా సారథి?" అన్నాడు ఎగతాళిగా ఉత్తరుడు. సైరంధ్రి బృహన్నల సారథ్యాన్ని గూర్చి గొప్పగా పొగిడింది. చివరకు ఒప్పుకుని బృహన్నలను (అర్జునుడిని) సారథిగా నియమించుకొని రథం ఎక్కి యుద్ధానికెళ్ళాడు ఉత్తరుడు. అక్కడ శత్రుసేనలోని అతిరథులనూ, మహారథులనూ చూసి వణికిపోయాడు. తనకు భయంగా ఉందనీ రథాన్ని వెనక్కు తిప్పమనీ బృహన్నలను వేడుకున్నాడు. బృహన్నల అలా చేయలేదు. ఉత్తరుడు రథం నుండి దూకి పారిపోతూ ఉండగా. బృహన్నల అతడిని పట్టుకొచ్చి సారథిగా ఉండమనీ, తాను యుద్ధం చేస్తాననీ చెప్పాడు.

అప్పటికి పాండవుల అజ్ఞాతవాసపు గడువుకూడ పూర్తి అయింది. బృహన్నల మాటలకు ఉత్తరుడు ఆశ్చర్యపోయాడు. చేసేదిలేక, బృహన్నలకు సారథ్యం చేయటానికి ఒప్పుకున్నాడు. అప్పుడు బృహన్నల తాను శమీ వృక్షంపై దాచి ఉంచిన గాండీవాన్ని చూపించి, దాన్ని తీసుకురమ్మని ఉత్తరునికి చెప్పాడు.

శవంవలే కన్పిస్తున్న ఆ గాండీవాన్ని ముట్టుకోవటానికి ఉత్తరుడు భయపడి వణికిపోయాడు; ఆ గాండీవాన్ని గురించి బృహన్నల వివరంగా చెప్పి, తానెవరో చెప్పితేగాని ఉత్తరుడు బృహన్నల ఎవరో గ్రహించలేకపోయాడు.

అర్జునుని దేవదత్త శంఖం ధ్వనికి ఉత్తరుడు భయపడి స్పృహ తప్పి పడిపోయాడు. బృహన్నల అతడిని లేపి కూర్చోబెట్టి, యుద్ధం చేసి గెలిచాడు.

ఆనాటి ఉత్తరకుమారుని పేరుతో ఈనాటికి, మనం ఎందరినో పిలుస్తూనే ఉన్నాం. నిజానికి ఆకాలంలో ఆ ఉత్తరుడు ఒక్కడే. ఈ కాలంలో ఎందరో ఉత్తర కుమారులు.



© SCERT not to be republished